క్లుప్తంగా

జాతరలో తప్పిపోయిన చిన్నారుల అప్పగింత



పిల్లలను తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

వాంకిడి: శివాలయంలో పూజలు చేసుకుని జాతరకు వెళ్లిన ఓ కుటుంబంలోని ఇద్దరు చిన్నారులు తప్పిపోగా తిరిగి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్సై ప్రశాంత్ బుధవారం తెలిపారు. మండల కేంద్రంలో జరిగిన జాతరలో విధుల్లో ఉన్న పోలీసులు తప్పిపోయిన చిన్నారులను గుర్తించి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

దేశీదారు రవాణా చేస్తున్న ఒకరిపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్: మహారాష్ట్ర నుంచి కాగజ్‌నగర్ పట్టణానికి దేశీదారు రవాణా చేస్తున్న పట్టణానికి చెందిన సోహెల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణ శివారులో బుధవారం తనిఖీలు నిర్వహిస్తుండగా, పట్టణానికి చెందిన సోహెల్ స్కూటీపై 400 దేశీదారు 90 ఎంఎల్ బాటిళ్లను తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. దాడుల్లో ఎస్సైలు లోభానంద్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని బుధవారం అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గజియాబాద్‌కు చెందిన మోహమ్మద్ ఖలీల్, షేక్ ఖలీద్‌లు పట్టణంలోని సీతాపతి ఏరియా, బాలాజీనగర్, పెట్రోల్‌పంపు ఏరియాతో పాటు ఖమ్మం, ఒంగోలు, గుంటూరు, మధ్యప్రదేశ్‌లలో దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. ఈ మేరకు వారి నుంచి ఒక ద్విచక్ర వాహనంతో పాటు 88.30 తులాల వెండి వస్తువులు, రూ.3,700 నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నిందితులను పట్టుకునేందుకు కీలకపాత్ర పోషించిన కానిస్టేబుళ్లు రాజు, సంపత్, వెంకటేశ్‌లను డీఎస్పీ రామానుజం అభినందించినట్లు తెలిపారు.

పెట్రోల్‌లో నీళ్లు



పెట్రోల్‌లో నీళ్లు ఉన్నాయని చూపిస్తున్న వాహనదారుడు

కౌటాల: కౌటాల మండలం ముత్తంపేట సమీపంలోని నయరా పెట్రోల్ పంప్‌లో బుధవారం పెట్రోల్‌కు బదులు నీళ్లు వచ్చాయని బాధితుడు దహెగాం మండలం బిబ్రా గ్రామానికి చెందిన దుర్గం వసంత్ పంపు వద్ద ఆందోళనకు దిగాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీటర్, అర లీటర్ వాటర్ బాటిళ్లలో పెట్రోల్ కొనుగోలు చేయగా నీళ్లు వచ్చాయన్నాడు. సిబ్బందిని ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినట్లు తెలిపాడు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు. నిర్వాహకులను సంప్రదించగా పెట్రోల్‌లో ఎలాంటి నీరు రాలేదని, వాహనదారుడు కావాలనే ఆరోపణ చేస్తున్నట్లు తెలిపారు.

ఆటో బోల్తా.. ఒకరి మృతి

వాంకిడి: ఆటో బోల్తాపడి ఒకరు మృతి చెందగా ఐదుగురు తీవ్ర గాయాల పాలైన ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని మర్కగోంది(శేన్‌గాం) గ్రామానికి చెందిన షేక్ హకాని(55) మండలంలోని గోయెగాం(మహాగాం)లో నివాసం ఉంటూ వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా బుధవారం ఉదయం పని నిమిత్తం మండల కేంద్రానికి వచ్చి పనులు ముగించుకుని షేరింగ్ ఆటోలో గోయేగాంకు వెళ్తుండగా గణేశ్‌పూర్ సమీపంలో జాతీయ రహదారిపై ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఆటోలో ఉన్న షేక్ హకానితో పాటు మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హకాని ఛాతిపై తీవ్ర గాయాలు కావడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గాయపడిన ఖాతూన్ బీ, జైతూన్‌బీలను మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు, షేక్ అమన్‌ను ఆదిలాబాద్‌కు మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు. లహను, ఇసాక్‌లకు ఆసిఫాబాద్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఆటో డ్రైవర్ బోయ పెంటు అజాగ్రత్తతో, అతి వేగంగా వాహనాన్ని నడపడం వల్లనే ప్రమాదం జరిగిందని మృతుడి కుమారుడు షేక్ లాలా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆసిఫాబాద్‌అర్బన్: బాలేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



తిర్యాణి: శివాలయంలో క్యూలో భక్తులు



దహెగాం: లగ్గాం ఉమాచంద్రశేఖర ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు



ఓం నమఃశివాయ!



కెరమెరి: అభిషేకం చేస్తున్న మహిళలు



పెంచికల్‌పేట్: అలంకరణలో భద్రకాళి అమ్మవారు



పల్లకి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



ఆసిఫాబాద్‌అర్బన్: శివకేశవ మందిరంలో శివపార్వతులకు ప్రత్యేక పూజలు



ఆసిఫాబాద్‌అర్బన్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేస్తున్న భక్తులు

- ఘనంగా మహాశివరాత్రి
- ఆలయాల్లో సందడి
- ప్రత్యేక పూజలు చేసిన భక్తులు

కెరమెరి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలోని శివాలయం భక్తులతో కిటకిటలాడింది. శివనామస్మరణతో ఆలయం ఆధ్యాత్మికత సంతరించుకుంది. ఆలయ అర్చకుడు కులకర్ణి బాపూదేవ్ ఆధ్వర్యంలో భక్తులు శివలింగం, గణపతి, గౌరీ, నాగేంద్రుడు, ఆంజనేయ స్వామికి పాలు, పెరుగు, పూ లు, తేనే, పంచదారతో అభిషేకం చేశారు. అస్తోత్తర పూజలు, రుద్రాభిషేకం కొనసాగాయి. రావి చెట్టుకు మహిళలు పూజలు, ప్రదక్షిణలు చేశారు. తెల్లవారు జాము నుంచి సాయంకాలం వరకు భక్తులతో శివాలయం కిక్కిరిసింది. వేద మంత్రాలు, దూప, దీప నైవేద్యాలతో ఆలయం మార్మోగింది.

వేంకటేశ్వరస్వామి పల్లకి ఊరేగింపు..

మండల కేంద్రంలో బుధవారం శ్రీ వేంకటేశ్వర స్వామి పల్లకి ఊరేగింపు అత్యంత ఘనంగా కనుల పండువగా జరిగింది. నెహ్రూనగర్‌లో గల ఆలయం నుంచి శివాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అడుగడుగున మహిళలు స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి ప్రతిమలకు పూజలు చేశారు. మంగళహారతులిచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

దహెగాంలో..

దహెగాం: మహా శివరాత్రి సందర్భంగా బుధవారం మండల కేంద్రంతో పాటు, లగ్గాం, చిన రాస్పెల్లి, కుంచవెల్లి గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లగ్గాం గ్రామంలోని ఉమా చంద్రశేఖర ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో జాతర కొనసాగింది. అనంతరం వేద పండితుల ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శివనామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

తిర్యాణిలో..

తిర్యాణి: శివరాత్రి పురస్కరించుకుని మండలంలోని మొహింద, గుడిపేట, తిర్యాణి, చెలిమల, బుగ్గరామన్న గూడేల్లోని శివాలయాలు శివనామ స్మరణతో మారుమోగాయి. ఈ సందర్భంగా భక్తులు ఉదయం నుంచే శివలింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొహింద శివాలయంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పూజలు చేశారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: మండలంలోని పంచకళపురి క్షేత్రంలోని శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగే శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు భక్తులు ఆలయం సమీపంలోని పెద్దవాగులో స్నానాలు ఆచరించి ఆలయంలో రుద్రాభిషేకం, పూజలను నిర్వహించారు. భద్రకాళీ సమేత వీరభద్రస్వామిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకున్నారు. మండలంలోని అగర్‌గూడ గ్రామంలోని మారమ్మ దేవత మూర్తులకు గ్రామస్తులు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సంగమ ప్రాంతంలో పవిత్ర స్నానమాచరించి దేవతా మూర్తుల ప్రతిమలను ఆలయంలో నిలిపారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: మండల కేంద్రంతో పాటు అందుగుల గూడ గ్రామ సమీపంలోని మల్లన్న గుట్ట వద్ద బుధవారం మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని శ్రీ రంగ నాయక స్వామి ఆలయంతో పాటు శివాలయం, బ్రహ్మంగారి ఆలయం, అంజన్న ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే భక్తులు ప్రాణహిత వాగులోకి వెళ్లి స్నానాలు ఆచరించారు. మండల కేంద్రంలోని శివాలయంలో ఎస్సై ప్రవీణ్ కుమార్- శ్రీలత దంపతులతో పాటు మాజీ ఎంపీపీ కొండ్ర మనోహర్ గౌడ్ దంపతులు, మాజీ జెడ్పీటీసీ కొండ్రా జగ్గా గౌడ్ శారద దంపతులతో పాటు పలువురు దంపతులు మహాశివరాత్రి సందర్భంగా శివుడి విగ్రహానికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శివపార్వతుల విగ్రహాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి శివపార్వతుల కల్యాణం జరిపారు.

జిల్లాకేంద్రంలో..

ఆసిఫాబాద్‌అర్బన్: మాఘబహుళ చదుర్దశి మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి పట్టణంలోని పెద్దవాగులో భక్తులు నదీ స్నానం ఆచరించారు. ఉపవాసదీక్షలు, జాగరణ, భజనా కార్యక్రమాలతో ఆలయాలు సందడిగా మారాయి. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్ ఆలయంలో ఉదయం 6 గంటలకు సుప్రభాతసేవ, కలశ గణపతిపూజ, పుణ్యావచనం, అంకురారోపణ, దేవతాస్థాపన, రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను స్థానిక శివకేశవ మందిరం నుంచి బాంగ్లాలతో, భాజాభజంత్రీలతో, భక్తి పాటలతో, యువకులు నృత్యాలు చేసుకుంటూ ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. శివాలయానికి వచ్చే భక్తులకు విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. రాత్రి 7 గంటలకు వేద పండితులు నారాయణమూర్తిశర్మ, ఆలయ అర్చకులు తిరుపతిచారిల ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా చేపట్టారు. కల్యాణానికి ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీ బాలేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు శ్రీధర్‌శర్మ బ్రాహ్మణవాడ గణేశ్‌మందిర్, సాంబశివుని ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జడ్పీ ఎంపీ రమేశ్, సీఐ బుద్దే రవీందర్, మాజీ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావ్, బోనగిరి సతీశ్‌బాబు, బాలేశ్వర్‌గౌడ్, రావుల శంకర్, చిలువేరె వెంకన్న, రూప్‌నార్ రమేశ్, శ్రీనివాస్, శివాలయం ఉత్సవ కమిటీ ప్రముఖులు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తాటిపల్లిలో జన జాతర

కౌటాల: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా కౌటాల మండలంలోని తాటిపల్లి గ్రామంలో గల శ్రీ సిద్ధి హనుమాన్ మందిరంలో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సమీప గ్రామాల రైతులు ఎడ్లబండ్లపై జాతరకు రాగా అటు మహారాష్ట్రలోని భక్తులు నాటు పడవలపై జాతరకు వచ్చి వార్ధా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో వార్ధా నది తీరం జనజాతర తలపించింది. అనంతరం ఆలయంలోని హనుమాన్ విగ్రహాన్ని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయా గ్రామాల భక్తుల భజనతో ఆలయంలో భక్తి భావం నెలకొంది. ఆలయం ఎదుట షాపుల్లో భక్తులు పలు వస్తువులు కొనుగోలు చేస్తూ సందడి చేశారు. దీంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కౌటాల వ్యాపారవేత్త బొమ్మకంటి దివాకర్ ఆధ్వర్యంలో భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కౌటాల మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామ సమీపంలోని ప్రాణహిత నది పుష్కర్ ఘాట్ ఒడ్డున గల శ్రీ శివసంత కార్తీక్ స్వామి మహరాజ్ మందిర్ ప్రశాంత నిలయంలో మహాశివరాత్రి జాతర మహోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రాణహిత నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. కౌటాల కంకలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక శివాలయంలో భక్తులు పూజలు చేశారు. దీంతో ఆలయాల వద్ద భక్తుల సందడి నెలకొంది. కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు నారాయణ్ పటేల్, అంబేద శంకరయ్య, సంతోష్, ఆలయ కమిటీ చైర్మన్ ఎల్ములే దత్తు, సుల్వ కనకయ్య, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాసవి మందిరంలో..

ఆసిఫాబాద్: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని వాసవీ మందిరంలో అర్చకులు ముదిగొండ రాజశేఖర శర్మ ఆధ్వర్యంలో పార్థివ లింగపూజ నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో..

కాగజ్‌నగర్‌రూరల్: మహాశివరాత్రి పురస్కరించుకుని బుధవారం మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయం ఆవరణలో మహాజాతర కొనసాగింది. ఉదయం నుంచే భక్తులు శివుడిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్, బీజేపీ నాయకులు కొత్తపల్లి శ్రీనివాస్‌లు పూజలు చేశారు.



కాగజ్‌నగర్‌రూరల్: అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు



కెరమెరి: శివాలయంలో భక్తులు



తిర్యాణి: పూజలు నిర్వహిస్తున్న భక్తులు



దహెగాం: లగ్గాం శివాలయంలో..



బెజ్జూర్: పూజలు నిర్వహిస్తున్న ఎస్సై దంపతులు



కౌటాల: తాటిపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు



కౌటాల: జాతరలో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



కౌటాల: తాటిపల్లి జాతరకు ఎడ్లబండిలో భక్తుల రాక..



కెరమెరి: పల్లకిలో వేంకటేశ్వర స్వామి విగ్రహాలు

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం



కెరమెరి: పోలింగ్ కేంద్రానికి చేరిన ఎన్నికల సిబ్బంది



బెజ్జూర్: ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది



రెబ్బెన: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రామ్మోహన్‌రావు

కెరమెరి: ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. మండలంలో పట్టభద్రుల ఓటర్లు 192 మంది ఉండగా.. టీచర్ ఓటర్లు 20 మంది ఉన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ దత్తు ప్రసాద్ బుధవారం తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ఆరుగురు సిబ్బందిని నియమించామని, గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని తహసీల్దార్ తెలిపారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ భూమేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కేంద్రంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 13 మంది, పట్టభద్రులు 317 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. మొత్తం 330 మంది కేంద్రంలో ఓటుహక్కును వినియోగించుకుంటారని, పోలింగ్ సిబ్బంది బుధవారం బెజ్జూర్‌కు చేరుకున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ రామ్మోహన్‌రావు సందర్శించారు. పోలింగ్ సిబ్బంది సామగ్రితో కేంద్రానికి చేరుకోగా సౌకర్యాలపై తహసీల్దార్ ఆరా తీశారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ప్రక్రియ సాగేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందని ఓటు వేసేందుకు వచ్చే పట్టభద్రులు, ఉపాధ్యాయులు తప్పనిసరిగా తమ వెంట ఎన్నికల సంఘం ద్వారా గుర్తించబడిన ఏదైనా ఒక గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల సంఘం నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు.

చివరి దశలో వంతెన పనులు

ఇచ్చోడ: మండల కేంద్రంలో నిర్మిస్తున్న డబుల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా శివాజీ చౌక్‌లో నిర్మిస్తున్న వంతెన పనులు చివరి దశకు చేరుకున్నాయి. గత నెల రోజుల కిత్రం వంతెన పనులు ప్రారంభమయ్యాయి. దీంతో ప్రైవేట్, ద్వి చక్రవాహనాలను సోనార్ గల్లి మీదుగా దారి మళ్లించారు. ఆర్టీసీ బస్సులను మండల కేంద్రంలోనికి అనుమతించండగా ఆర్టీసీ బస్టాండ్ నుంచి జాతీయ రహదారి నుంచి దారి మళ్లించారు. వంతెన పనులు కొనసాగడంతో గత నెల రోజుల నుంచి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కానీ పనులు పూర్తయి వంతెనకు ఇరువైపులా సైడ్‌వాల్ నిర్మాణం పనులు చేపడుతున్నారు. వారం పది రోజుల్లో వంతెన గుండా వాహనాల రాకపోకలు ప్రారంభం కానున్నాయి. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.